

శాంతాదేవి

రైలు స్టేషన్‌లో ఆగింది. అంతవరకు కునికిపాట్లు పడుతున్న సావిత్రి మెలకువ తెచ్చుకుని చుట్టూ చూసింది. బయటసన్నగా తుంపరపడుతూంది. అది చాలా చిన్న స్టేషన్. రైలు ఎక్కువసేపు ఆగకుండానే బయలు దేరింది. రైలు కదలగానే ఒక నడివయస్సు మనిషి గబ గబా చేతిలో పెట్టె లోపలికి తోసి తనుకూడా లోపలికి జొరబడ్డాడు. పెట్టెలో ఎక్కువమంది జనం లేక పోయినా అసలు లేకుండా పోలేదు. అతను పెట్టె ఓ వారగా ఉంచి చోటు కోసం కలయజూశాడు. సావిత్రి భర్త సూర్యనారాయణ తన పక్కనున్న పిల్లవాణ్ణి తీసి ఒళ్లో కూర్చోపెట్టుకొని, ఆ పెద్దమనిషిని ఆ స్థలంలో కూర్చోమన్నట్టుగా సైగ చేశాడు. అతను ఎక్కువసేపు ఆలోచించకుండానే సూర్యనారాయణ పక్కన కూర్చున్నాడు. రైలు పోతూంది. చిన్న చిన్న ఊళ్లు దాటిపోతున్నాయి. సావిత్రి బయటికి చూస్తున్నదల్లా ఒకసారి ఇటుతిరిగి ఎదురుగా కూర్చున్న ఆయనవేపు చూసింది. మళ్లీ చూసింది. చూపు మరల్చుకోకుండా పరిశీలనగా. ఆమె మనస్సు ఎక్కడో జ్ఞాపకాలను తవ్వుతూంది. ఒక్కసారిగా గుర్తువచ్చి నట్టు 'అవును. . . . .అతనే, అతనే!' అనుకుంది. మనస్సులో. ఆమెకళ్లు ఒక్కసారిగా మెరిశాయి వింతగా. 'ఎంత ఆశ్చర్యం! ఏనాటి కలయిక యిది? మళ్లీ ఈనాడు ఇలా కలుసుకోవటం? . . . .' ఆశ్చర్యంతో

(తరువాయి 34 వ పేజీలో)

నిప్పులా చేసుకుని చూస్తున్నాడు అతను భార్యవేపు. సావిత్రి తల దించుకుంది. ఆమె కళ్లల్లోని కన్నీటి పొర అర్థం చేసుకునేశక్తి ఎవరికీలేదు. గంటలు గడిచిపోయాయి. రైలు ఏదో చిన్నస్టేషన్‌లో ఆగగానే అతను పెట్టె తీసుకుని రైలు దిగాడు. తనను వెంటాడుతున్న చూపులను గమనించేస్థితిలోలేడతడు.

సావిత్రి వెళ్లిపోతున్న అతనివేపే చూస్తూ కూచుంది. రైలు కదిలేవరకూ. ఆమె మొహంలో కారు మేఘాలు అలుముకున్నాయి. 'అతను ఒక్కసారి తనవేపు చూస్తే? . . . గుర్తించినట్టు మొహంపెడితే! లేదు. అతడు తనను గుర్తుపట్టలేదు!' సావిత్రి నిరాశగా నిట్టూర్చింది. 'అతని మొహంలో దైన్యానికి, విచారానికి కారణం మరేమైనా ఉన్నదా?' అనుకుంది సావిత్రి. 'అతని చూపులు అంత దీనంగా ఉండటానికి కారణ మేమిటి?' సావిత్రి ఆలోచనలు సాగిపోతున్నాయి. 'అతని పరిస్థితులు ఏవిధంగా ఉండి ఉంటాయో!' పెళ్లి అయినట్లు తెలుసుగానీ, తరవాత అతన్ని గురించి ఒక్క విషయం కూడా తెలిసిరాలేదు. అతనికే విధం గానూ విచారం ఉండి ఉండదా?' సావిత్రి ఎగతాళిగా నవ్వు కుంది తనలో తాను. 'ఆనాడు అతను వలచి చేసుకుందా మనుకున్న పిల్ల దూరమయింది. అది అతని అసమర్థతే కావచ్చు. అయినా ఆలోటు ఎవరూ తీర్చలేనిదికదా! ఇంతకన్నా వేరే కారణమేమి కావాలి? తనకు పెళ్లి కాకుండా పోలేదు, అతనికీ భార్య రాకపోలేదు. కానీ తమ ఇద్దరికీ ఆకాశానికీ, భూమికీ ఉన్నంత దూరం ఉంది. అది ఈ జన్మకి తరగదు. ఇంతకన్నా విచార మేమి ఉంది, తమ జీవితాల్లో!' సావిత్రి నిట్టూర్చింది. ఆ ఆలోచనే ఆమె గుండె నలిపివేస్తున్నట్టుంది. . . రైలు స్టేషన్‌లో ఆగగానే భర్త వెంట పిల్లలతో మెల్లిగా దిగింది. భార్య మొహంలో ఒక విధమైన మార్పు కనిపెట్టాడు సూర్యనారాయణ. . . .మనస్సుకి ఎంత సర్ది చెప్పుకుందామన్నా అతని రూపం అనుక్షణం వెంటాట్టం మానలేదు సావిత్రిని చాలా రోజులు. 'భర్త ఉండీ, నలుగురు పిల్లల తల్లి అయి, ఈనాడు గతాన్ని తలుచుకు విచారించటం, తెలివితక్కువ, నిరర్థకము కూడాను!' అనుకునేది. అయినా తనకు జీవితంలో జరిగిన పొరపాటు ఆమె మరిచిపోలేక పోతూంది. పెళ్లి అయిన ఇన్నాళ్లకు అతను తటస్థపడి మానుతున్న గాయాన్ని రేపినట్టయింది. 'అతని జీవితం ఏవిధంగా ఉండి ఉంటుంది?' సావిత్రి కళ్లముందు చిన్న తెర లేచింది. 'భార్య అనాకారిదే కావచ్చు. తండ్రి అడుగు జాడల్లో నడిచే మనిషికి కట్నం కోసమే వివాహ మాడే ప్రబుద్ధుడికి అందంతో పనిలేదు.' సావిత్రి ప్రతిక్షణం అతని కుటుంబ పరిస్థితులు తెలుసుకుంటూ ఉంటుంది.

అనాకారి భార్యతో, ఇష్టంలేని సంసారం సాగిస్తూ, గతించిన జ్ఞాపకాలని మనస్సులోనించి చెరిపివెయ్యలేక, ఒక విధమైన మానసిక వ్యథతో కుంగి కుమిలిపోతున్న ఒక మానవాకారం గోచరించేది ఆమె కళ్లకి. వెంటనే కసితో కూడిన చిరునవ్వు మెదిలేది ఆమె పెదవులపైన. వెనకనే చిన్ననిట్టూర్పు. అది సంతృప్తితో కూడినదో, నిరాశా పూరితంగా వెలువడినదో ఆమెకే అర్థంకాదు.

* * *

"రండి. చాలా రోజులకి కనిపించారు. కులాసాగా ఉన్నారా? ఎప్పుడు రావటం?" సావిత్రిని ఆహ్వానిస్తూ పార్వతి సంతోషంగా చూసింది.

"ఇన్నాళ్ళయినా నన్ను మరిచిపోలేదన్నమాట!" సావిత్రి మెల్లిగా నవ్వింది.

"అమ్మో! ఒక ఇంట్లో ఏడు సంవత్సరాలపాటు కలిసి ఉన్నావన్న జ్ఞాపకమేనా లేదంటారా నాకు?"

". . . . . . . . . . . . . . . . ."

. . . . . . పుట్టింటికి వచ్చిన సావిత్రి ఎదురింట్లో కొత్తగా దిగిన పార్వతిని చూసి గుర్తుపట్టి పలక రించింది. సావిత్రి అత్తవారింట్లో ఏడేళ్లపాటు ఉన్న పార్వతి సావిత్రితో పరిచయం మరిచిపోలేదు, ఏళ్లతరబడీ మనుషులు దూరమయినా అది చాలా ఆనందాన్ని కలగజేసింది సావిత్రికి. 'అద్దెకు ఉన్నంత మాత్రాన ఇన్నేళ్లపాటు గుర్తుంచుకునే ఓపిక ఎంతమందికి?' అనుకుంది. . . . . . .

మామూలు కబుర్లు పూర్తి అయ్యాక ఒకరినిగూర్చి ఒకరు పూర్తిగా తెలుసుకున్నారు. పెళ్లికాకముందు సావిత్రితో పరిచయం ఉన్న పార్వతి జీవితంలో చాలా మార్పులు జరిగాయి. . . . . ఈ మధ్యకాలంలో పార్వతి పెళ్లి అయింది. ఇద్దరు పిల్లలు కూడాను . . . పార్వతి పెళ్లిఫోటో చూసిన సావిత్రి మనస్సు తీవ్రంగా గాయపడ్డది. తదేకంగా ఫోటోవేపు చూస్తున్న ఆమె కళ్లల్లో కనిపించీ, కనిపించకుండా సన్నటి నీటిపొర కదలి మాయమైంది. సావిత్రిలోని మార్పు కనిపెట్ట లేని పార్వతి తన సంసార జీవితంలోని విశేషాలను చెబుతూంది. ఆనందంతో, భర్త తననెంత ప్రేమగా చూసుకుంటున్నదీ, పిల్లల ఆటపాటలు, వారి ముద్దు ముచ్చట్లూ మొదలయినవి. ఇవేమీ వినేస్థితిలోలేదు సావిత్రి. ఆమె మెదడు మొద్దుబారిపోయింది. . . ఏదో చెప్పి, "ఏమంటావు సావిత్రీ?" అని అడిగింది పార్వతి. ఆమె మొహంలో సంతోషాన్ని పాడు చెయ్యటం ఇష్టంలేక, అసలుమాట చెవిన పడక పోయినా నీరస కంఠంతో,

"అవును పార్వతీ, నువ్వు చాలా అదృష్టవంతురాలివి. జీవితంలో ఇంతకన్నా స్త్రీ కోరుకునేది ఏమీలేదు. . .' అని నిట్టూర్చింది.

"నేను వెడతాను పార్వతీ" అని లేచింది. ఉన్నట్టుండి స్నేహితురాలిలో మార్పు అర్థంకాక,


"అదేమిటే, అప్పుడే? మావారు వస్తారు. పరిచయం చేస్తాను ఉండు. . ." అని బలవంత పెడుతున్న పార్వతిని వదిలించుకుని చెరనుంచి బయట పడ్డట్టుగా ఆ ఇంట్లోంచి ఇవతల పడింది సావిత్రి.

"ఈరోజు ఎంతటి దురదృష్టకరమైనరోజు! ఎటువంటి వార్త వినవలసి వచ్చింది!" అనుకుంటూంది దారిలో. ఆవార్త తనకు ఏవిధంగా విషాదకరమైనదో అర్థం కావటంలేదు ఆమెకు. 'తనకులేని సుఖ సంతోషాలు అతనికి లభ్యమైనాయన్న అసూయ తప్పితే తనలో ఏంలేదు!' అనుకుంది సావిత్రి.

. . . . . ఇంటికి వచ్చాక చాలా సేపటివరకు మామూలు మనిషి కాలేకపోయింది.

"అనుకూలవతి అయిన భార్యతోను, ఇద్దరు పిల్లలతోను ఏ విధమైన చీకు, చింత లేక సుఖంగా సంసారం చేస్తున్న అతని సంతోషంలో భాగం పంచుకో వలసిన హక్కు తనది. అది పార్వతిపరం అయింది. తను అనుభవించవలసిన సుఖాలన్నీ పార్వతి సొత్తయి నాయి. . . . . ." సావిత్రి దీర్ఘంగా నిట్టూర్చింది. ఆమె కళ్లల్లోకి ప్రయత్నించినా నీటిబొట్టు రావటం లేదు. నిరాశ, నిర్లిప్తత ఆమె మొహంలో చోటు చేసుకున్నాయి. మనస్సు ఎన్నడూ లేనంతగా వ్యథా పూరితమైపోయింది. 'తను ఇంతగా విచారపడటానికి కారణం వేరేఉంది.' అనుకుంది సావిత్రి నిజాన్ని తెలుసుకున్నట్టు.

. . . . . 'అతని సంసారం ఇలాకాక, మరోవిధంగా తను ఊహించిన విధంగా . . . అనాకారి భార్యతోను



"తొండము నేకదంతమును...."
ఫోటో—బి. ఆర్. కె. మురళి (న్యూఢిల్లీ - 10)

ఆర్థిక బాధలతోను తనని మరిచిపోలేక వ్యథ చెందే అతని రూపం కనిపించి ఉంటే తనకి ఇంతబాధ ఉండేదికాదు!' సావిత్రి నిస్సహాయురాలిలా కన్నీరు కార్చింది. అతను తనకన్న ఎన్నోరెట్లు సుఖంగా జీవిస్తున్నాడు. అదే తన అసంతృప్తికి కారణమయింది. ఆ నిజాన్ని మనస్సు ఒప్పుకోకపోయినా అంతరాంతరాలలో మెదిలే కోర్కెను తను మరుగుపరచలేదు. . . . .

. . . . తన మనసులో మాట ఒప్పుకోవటానికే భయపడుతూ తన జీవితాన్ని, తన భవిష్యత్తునూ తేల్చుకోవటానికే భయపడుతూ జారిపోయిన అవకాశం కోసం బాధ పడుతూంది పిచ్చి సావిత్రి, శూన్యంగా ఆకాశంలోకి చూస్తూ. ★